1,725/- రూ. క్రైనెటిక్ మిక్సీ బహుమతికి అర్హమైన కథ:

# ఆడది - ఆకలి

## - పొన్నాడ సత్య ప్రకాశరావు



**అక్కడ కళ్ళు మాట్లాడుకుంటాయి.**

**కళ్ళేకాదు నొసలు కూడా!**

**ఆ కళ్ళకి మాటాడటమే కాదు, ఆకలి కూడా తెలుసు.**

ఆ ఆకలి చూపుల్ని ఓ ఆడది మాత్రమే అర్థం చేసుకోగలదు.

ఆ చూపులు మహాశక్తి వంతమయినవి. నిప్పుల్ల లేకుండా అగ్నిని రాజేస్తాయి.

ఒంటిమీద చేయి వేయకుండా ఉడుపు లన్నిటినీ ఒలిచేస్తాయి.

ఆ చూపులు తనకి కొత్త కాదు. ఆఫీసుకి వెళ్ళడానికి ముస్తాబయి ఇంట్లో నుంచి వీధిలోకి పాదం మోపినప్పుడే ప్రారంభమవుతుంది వేట. తన రాకకోసమే ఎదురు చూస్తుంటారు కాబోలు, ఆ చూపులు సూదుల్లా గుచ్చుకుంటాయి.

నఖశిఖ పర్యంతం పరీక్షిస్తుంటాయి. తాను సిగ్గుతో చితికిపోతుంది. చూపుల్ని నేలకు గుచ్చి, నేలలో కూరుకుపోతున్న పాదాల్ని పెళ్ళగించుకుంటూ కదుల్తుంది. తలొంచు కుంటే ఏడు కొండలు అడ్డుపెట్టినట్టట!

- అది నిజమేనని నా అనుభవం నేర్పింది.

ఆ చూపుల్ని దాటుకుని బస్‌స్టాపు కొస్తాను. నా తండ్రి వయసు నుంచి, నా తమ్ముడు ఈడు వరకు... ఎందరెందరో!

అందరూ కాకపోయినా కొందరయినా చూస్తుంటారు. ఆకలిగా, వెర్రిగా.

బస్‌లో ప్రయాణిస్తున్నప్పుడు నన్ను తాకి థ్రిల్ ఫీలయ్యేది కొందరు; వల్గర్ జోక్స్ విసురుకుంటూ ఆనందించేది మరికొందరు.

బస్ గమ్యం చేరేవరకు నేనొక శిలను. ఎండకు ఎండి, వానకు తడిసే శిలకూ నాకూ తేడా లేదు. ఎవరు నన్ను తాకినా నేను పట్టించుకోను. పట్టించుకుంటే నేను రోజూ బస్‌లో ప్రయాణం చేయలేను. అంతేకాదు, నాకు బ్రహ్మ చెముడు. నా పక్కనే నిలబడి ఎవరు ఏం మాట్లాడుకుంటున్నా నాకు వినిపించదు. వినిపిస్తే ఆ కామెంట్స్‌కి తట్టుకోలేను.

ఇహ ఆఫీసు -

నాకు తెలుసు, అవసరమున్నా లేకున్నా నా బాస్ ప్రతి చిన్న విషయానికి నన్ను క్యాబిన్‌లోకి పిలుస్తాడు. నాది ప్రైవేట్ జాబ్. పిలిచినప్పుడు వెళ్ళకుంటే నా ఉద్యోగం ఊడుతుంది. నేను సీటులో నుంచి లేస్తే చాలు ఆఫీస్‌లోని ఎన్నో జతల కళ్ళు కలుసుకుంటాయి; హాయిగా నవ్వుకుంటాయి. నేను బాస్ క్యాబిన్ నుంచి తిరిగి వచ్చే వరకు అలాగే క్యాబిన్ డోరు వైపు చూస్తుంటాయి. నాకు బయటనుంచి ఫోను వచ్చినా, విజటరు వచ్చినా ఆసక్తిగా గమనిస్తుంటాయి.

ఆఫీస్‌లో ఫైలు ఇస్తూ ఒకరు, వెనుక నుంచి వచ్చ మరొకరు, ఇంకొక విధంగా ఇంకొకరు - పలువురు పలు రకాలుగా నన్ను తాకడానికి ప్రయత్నిస్తుంటారు. వారు నా పట్ల మాత్రమే గాదు, ప్రతి విషయానికి - ఆఖరికి డైలీ పేపరు న్యూస్‌కి కూడా ఆ విధంగానే రియాక్టు అవుతారు.



అన్నట్టు చెప్పడం మరిచాను –

నాకు ఇది కొత్త కాదు. స్కూలు రోజుల్నుంచి జరుగుతున్న భాగోతమే. ఇంటర్-స్కూల్ అథ్లెట్స్ ఛాంపియన్‌గా ఎన్నికయిన నాకు, మా పి.డి. గారికి సంబంధం వుందని స్కూలు గోడల మీద రాశారు. ఫలితంగా నేను ప్రాక్టీసు చేయడం మానేశాను. ప్రాక్టీసు మాత్రమే కాదు, స్పోర్ట్స్‌కి దూరమయ్యాను. తర్వాత కాలేజీ జీవితం ఆరంభమయింది. కొత్త వ్యక్తులు – కొత్త వాతావరణం అనుకున్నాను. కాని ఇక్కడా పాత కథే! క్లాసులోని అబ్బాయిలతో కొద్దిగా చనువుగా మాట్లాడితే అతడు అతి చనువు ప్రదర్శించాడు; ఆ అతిని హర్షించలేని నేను వెంటనే అతడ్ని ఎంత దూరంలోవుంచాలో అంత దూరంలో వుంచాను. దానితో అతడు ప్రేమ లేఖ రాసి పంపాడు. ఆ ఉత్తరం నా చేతికి చేరే లోపే నలుగురైదుగురు చూశారు. దానితో కాలేజీ అంతా ఒకటే గొడవ. మూతిమీద సరిగా మీసాలయినా మొలవని వాడికి ప్రేమ! నాకు నవ్వొచ్చింది. చిన్నపిల్లల ఆకతాయి చేష్టగా తీసుకున్నాను. కాని నా సహ విద్యార్థుల కామెంట్స్‌ని, పిచ్చి పిచ్చి రాతల్ని తట్టుకోలేపోయాను. ఒక రకంగా ఆ వాతావరణానికి ఇమడలేకపోయాను. కాలేజీ మారాను. ఈ పర్యాయం నేను చదువుతున్నది కో- ఎద్యుకేషన్ కాలేజీ కాదు. ఆడ పిల్లల కాలేజీ. జీవితాన్ని మరో కోణం నుంచి స్టడీ చేసే అవకాశం లభించింది. అవకాశం చిక్కితే అమ్మాయిల్ని అబ్బాయిలు అల్లరి పెడతారని, శీలం దోచుకుంటారని విన్నాను. ఇందులో నిజమెంత అన్నది కూడా నాకు తెలుసు. కాని ఓ ఆడపిల్ల మరో ఆడపిల్లని అల్లరి పెట్టడం ఓ ఆడపిల్ల శీలాన్ని మరో ఆడపిల్ల దోచుకోవడమన్నది నా అనుభవంలోకి వచ్చింది. ఒకర్ని గురించి మరొకరు ఎంత పచ్చిగా, నీచంగా మాట్లాడుకుంటారో చూశాను. ఈ విషయంలో నాకు మిన హాయింపు లేదు. వారి కామెంట్స్ విన్న తర్వాత ఎన్ని రాత్రులు నిద్ర రాక గడిపానో? క్రమ క్రమంగా వారి వ్యాఖ్యలు, ఆ వాతావరణం నా జీవితంలో ఒక భాగమయ్యాయి. పట్టించుకోవడం మానేశాను. నాలోని సెన్సిటివిటీ చనిపోయింది. డిగ్రీ పూర్తయింది. అసలైన జీవితం ఆరంభమయింది. ఉద్యోగాన్వేషణ ప్రారంభించాను.

ఏమయితేనేం అన్ని రకాల వారిని ఇంటర్వ్యూలో తృప్తి పరచడానికి ప్రయత్నించ సాగాను.

ఈ నేపథ్యంలో నాకు ఓ ఉద్యోగం వచ్చింది. మనిషి రూపు, రేఖా లావణ్యాలు కూడా ఉద్యోగానికి ఓ అర్హతని తెచ్చి పెడతాయని అనుకున్నాను గానీ, అవే మెయిన్ క్వాలిఫికేషన్ అని ఇంతకు మునుపు తెలియదు. అందుకే చక్కగా అలంకరించుకుని ఇంటర్వ్యూలకి వెళ్ళడం ప్రారంభించాను. నా అలంకరణ చూసి ఇరుగు పొరుగు కామెంట్స్ ప్రారంభించారు. నాకు ఉద్యోగం ఇచ్చేది వారు కాదు. అందుకే వారి కామెంట్స్‌కి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎట్టకేలకు నాకు ఓ ప్రైవేటు ఫర్మ్‌లో స్టెనో జాబ్ వచ్చింది. నా బాస్ ఫారిన్ రిటర్న్డు. పంక్చువాలిటీకి ప్రాధాన్యత ఇస్తాడు; డ్రెస్ మెయింటెనెన్స్ చూసి స్టాఫ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాడు. నా బాస్‌ని చూడటానికి వచ్చిన వారు / ఫోనులో మాట్లాడేవారు ముందుగా నన్ను చూడవలసిందే. అందుకే నా అలంకరణలో, నా మాట తీరులో నా ప్రత్యేకతని ప్రదర్శిస్తాను. దీనికి రకరకాల కామెంట్స్ వినిపించడం ప్రారంభించాయి. ఉద్యోగం లేని రోజున నేను వీటికి అంత ప్రాధాన్యత ఇచ్చేదాన్ని కాదు. బ్రతకడానికి ఉద్యోగం చేయాలి. ఆ ఉద్యోగంలో కొనసాగడానికి నేను అందంగా ముస్తాబయి రావాలి – అయితే నేను ఆలస్యంగా గ్రహించిన విషయం మరొకటి వుంది. నాకు కాబోయే భర్తకి నా ఉద్యోగం అవసరం – నా నెలసరి జీతం అవసరం – ఇప్పటి వరకూ నేను కూడ బెట్టిన డబ్బు అవసరం. అంతకు మించి ఆఫీసులో నా ప్రవర్తన అవసరం. మా కుటుంబం గురించి ఇరుగు పొరుగు వారి సర్టిఫికెట్ అవసరం. అందుకే ఇప్పటికీ నాకు పెళ్ళి కాలేదు. అవుతుందన్న ఆశతో నేను ఇప్పటికీ తలొంచుకునే వదుస్తున్నాను; బ్రతకడానికి నా అలంకరణలో మార్పు లేదు. అంతే!!

బహుమతులు అందజేస్తున్నవారు


